సాగుకు సన్నద్ధం..


బుట్టాయగూడెం మండలం ఇప్పలపాడు సమీపంలో నాగలితో పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

- తొలకరి పలకరింపుతో అన్నదాతల హర్షం
- ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- సుమారు 15,869 హెక్టార్లలో పంటలు పండించేలా ప్రణాళికలు సిద్ధం

బుట్టాయగూడెం: ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది మే నెలలోనే తొలకరి జల్లులు పలకరించాయి. దీనితో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొద్దిరోజులుగా భానుడి ప్రతాపంతో ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారి బాధ వర్ణనాతీతంగా మారింది. అయితే ఈ తరుణంలో తొలకరి వర్షాలు పలకరించి వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణీ కార్తె తన ప్రతాపం చూపించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పుడప్పుడు వాతావరణంలో మార్పులతో వాతావరణం చల్లగా ఉండడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరోవైపు వర్షాలకు భూమి పదునవ్వడంతోపాటు సాగునీటి వనరుల్లో నీరు చేరింది. దీనితో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. దీనికితోడు జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని, ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్తున్నారు. దీనితో ఈ ఏడాది ముందస్తుగానే పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

15,869 హెక్టార్లలో పంటల సాగుకు ప్రణాళిక

పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15,869 హెక్టార్లలో పంటలు పండించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో వరి 13,295 హెక్టార్లు, మొక్కజొన్న 1,484 హెక్టార్లు, మినుము 382, పెసర 424, కంది 284 హెక్టార్లలో రైతులు పంటలు పండించేలా అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

ఖరీఫ్ సాగు పెంచేలా కృషి



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు శాతం పెంచేలా ప్రత్యేక కృషి చేస్తున్నాం. ఇప్పటికే పంటలకు సంబంధించి రైతులకు అన్ని రకాల సలహాలు, సూచనలు అందజేశాం. సుమారు 15,869 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, మినుము, పెసర, కంది పంటలు పండించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

– పీజీ బుచ్చిబాబు, ఏడీఏ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

క్లుప్తంగా

చెట్లను సంరక్షించుకోవాలి


వృద్ధాశ్రమంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కొయ్యలగూడెం: మనిషి మనుగడకు చెట్లు ప్రధానమని వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డాక్టర్ కొండముది దిలీప్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కల్ప వృక్షం వృద్ధాశ్రమంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలను రోటరీ క్లబ్ సభ్యులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి నాటారు. కొయ్యలగూడెం నుంచి మొదలుకొని జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్న సమారాధన చేశారు.

ఘనంగా శ్రీపాదాలమ్మ వార్షికోత్సవం


పొంగళ్లను అమ్మవారికి సమర్పించేందుకు తీసుకువెళ్తున్న మహిళలు

కొయ్యలగూడెం: శ్రీపాదాలమ్మ అమ్మవారి వార్షిక వేడుకలు మంగళవారం అశోక్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. మత్స్యకారుల వీధిలో కొలువైన ఈ అమ్మవారికి తెల్లవారుజాము నుంచే అభిషేక పూజలు కుంకుమార్చనాది కార్యక్రమాలు ఆశాది (మహిళా పూజారి) నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పొంగళ్లను వండి తమ ఇళ్ల వద్ద నుంచి ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకువచ్చి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం నుంచి రెండువేల మందికి పైగా భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడులు సమర్పించుకున్నారు.

శిథిలావస్థలో ఉన్న తూము పరిశీలన


కొత్తపట్టిసీమలో శిథిలావస్థలో ఉన్న తూమును పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్త పట్టిసీమ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న తూమును ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సీతయ్య మంగళవారం పరిశీలించారు. కొత్తపట్టిసీమ పంచాయతీ పరిధిలోని హుకుంపేట జిల్లా పరిషత్ రోడ్‌లో పంపింగ్ స్కీమ్ కాలువపై శిథిలావస్థలో ఉన్న తూము పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆ ప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తూము పరిస్థితిని పరిశీలించారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ, రైతులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికీ విద్యాకానుక చేరాలి

భీమడోలు: పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికీ విద్యాకానుక కిట్లను అందించాలని విద్యాశాఖ కాకినాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి అన్నారు. భీమడోలులోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆమె మంగళవారం సాయంత్రం సందర్శించారు. స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు వివరాలను ఎంఈఓ–2 అయినపర్తి భాస్కర్‌కుమార్ నుంచి అడిగి తెలుసుకున్నారు. 1, 2, 8, 9, 10 తరగతుల వారీగా చేరిన పుస్తకాలు, రావాల్సిన పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల ముద్రణను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు రావాల్సిన నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫార్మ్స్ వివరాలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న విద్యా కానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేరాల్సిన బాధ్యత సంబంధిత మండల టీముపై ఉందన్నారు. ఎక్కడా అలసత్వం వహించివద్దని, ప్రతి విద్యార్థికీ చేరేలా తగు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పుస్తకాలను సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు సత్యప్రసాద్, రమణ, సిబ్బంది సుమలత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి స్థలం లీజు వేలం ఖరారు

పెదపాడు : పెదపాడు మండలం కలపర్రు గ్రామానికి చెందిన భీమేశ్వరస్వామికి చెందిన 46 సెంట్ల భూమిని రెండు భాగాలుగా విభజించి వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఒక భాగాన్ని గోవర్ధన శ్రీరామ్ ఫణికుమార్ రూ.80 వేలకు, రెండో భాగాన్ని ఉడత బాలమురళీ కృష్ణ రూ.1.51 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఒక సంవత్సర కాలానికి ఈ వేలం నిర్వహించినట్టు ఆలయ ఈఓ ప్రకృతాంబ తెలిపారు.

రుతుక్రమంపై అపోహలు విడనాడాలి


జంగారెడ్డిగూడెం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాసిక మహోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం: కాలింగులపేటలో మహిళలకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మంగళవారం మాసిక మహోత్సవం (పీరియడ్ ఫెస్టివల్) నిర్వహించారు. సీడీపీవో పి.బ్యూల ఆధ్వర్యంలో మహిళలు, కిషోర బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమం అనేది సాధారణమైన ప్రక్రియ అన్నారు. దీనిపై ఎటువంటి అపోహలు లేకుండా రోజువారీ పనులు చేసుకోవచ్చన్నారు. రుతుక్రమం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు. మహిళలు రుతుక్రమం సమయంలో శానిటరీ నాప్కిన్స్ వాడాలన్నారు. ఈ సందర్భంగా కిషోర బాలికలను రుతుక్రమం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే అపరిశుభ్ర వాతావరణం కారణంగా ప్రజలు సరివ్వకల్ కేన్సర్ బారిన పడుతున్నట్లుగా సర్వేలలో తెలుస్తోందని, కావున ప్రతి కిషోర బాలిక, 45 ఏళ్లలోపు తల్లులు అందరూ రుతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై వివరించారు. అలాగే బాలికలు, మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ నెంబర్లు, 1098, 100, 108, 112 గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీవో బ్యూలాతో పాటు సూపర్‌వైజర్లు కె.లక్ష్మి, జీఎం ఎస్‌కే కుమారి, గీత, అంగన్‌వాడీ టీచర్లు, కిషోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన

కొయ్యలగూడెం: మాసిక మాసోత్సవ కార్యక్రమం మంగళవారం కాలింగులపేటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీఓ యుఎన్ స్వర్ణకుమారి మాట్లాడుతూ రుతుక్రమం, ఆరోగ్యం , పరిశుభ్రత, అపోహలు తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణా, రుతుక్రమంలో ఇబ్బందులను ఎదుర్కొనే విధానం పోషకాహారం, సమతుల్యత, పోక్సో చట్టం విద్య, దిశ, బాలికలకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలు కిషోర బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ శాఖ విద్యా, వైద్య శాఖ అధికారులు ఎ.నయోమి రాణి, ఎం.హేమ అంగన్‌వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బయ్యనగూడెంలో ర్యాలీ

రుతుక్రమ ఆరోగ్య పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి వి.సత్యనారాయణ రుతుక్రమంలో మహిళలు ఎదుర్కొనే ఇబ్బందులను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని ఎం.గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు ఎస్‌కే చాన్‌భాష, కె.మరియమ్మ, హెల్త్ అసిస్టెంట్లు కె..మోహన్, టి.మంజునాథ్, ఏఎన్‌ఎంలు ఆశ అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు

బుట్టాయగూడెం: రైతులకు పంపిణీ చేసేందుకు జనుము, జీలుగు, పిల్లిపెసర విత్తనాలు ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్నట్లు వ్యవసాయాధికారి డి.ముత్యాల రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. మండల వ్యాప్తంగా జీలుగు 10 కిలోలు, జనుము 10 కిలోలు, పెసర 8 కిలోల చొప్పున సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు 1బి తీసుకుని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు వర్షాలకు అనుకూలించడంతో రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు సన్నద్ధమవ్వాలని అన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 8,485 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, అపరాలు, చెరకు, ప్రత్తి, వేరుశనగ వంటి పంటలు సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సంఘ రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.రవి, జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ భూ సమస్యలు, ఉపాధి హామీ కూలీల కూలి రేట్లు వంటి పలు సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఎర్రకాలువ ప్రాజెక్ట్ మిగులు భూములు, పంగిడిగూడెం, కేతవరం, గురవాయిగూడెం ల్యాండ్ సీలింగ్ భూములు, అలాగే టి.నరసాపురం మంగలి మెట్ట, రావమ్మ గూడెం ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టీఆర్ పోడు భూములు, దోసపాడు 400 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములను భూమి లేని నిరుపేదలకు పంచాలన్నారు. ఎ.పోలవరం ఉపాధి పని చేసే చెరువులో జేసీబీ యంత్రాలతో రాత్రి సమయాల్లో మట్టి తోలకాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకుండా ఎంపీడీవో, ఏపీవో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ మట్టి తోలుతున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఉపాధి పనులకు పే స్లిప్పులు ఇవ్వాలని, పనులు జరిగే చోట మజ్జిగ, మంచినీళ్లు, టెంట్‌లు, కనీస సౌకర్యాలు కలిగించాలన్నారు. 200 రోజులు పనులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రం, ఆర్.దానియేలు, వి.వెంకటేష్, ఎస్.మహంకాళి, ఏ.ప్రభాకర్‌రావు, వై.సీత, ఎస్.కోటేశ్వరరావు. హోలీ మేరీ, కె.దుర్గ, ఎస్.సాయికృష్ణ, పిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

దాసరోజుకి విశ్వకర్మ లెజెండరీ అవార్డు


దాసరోజు శ్రీనివాసరావును సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో తనకు లెజెండరీ అవార్డు ప్రదానం చేసినట్లు బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గాభివృద్ధికి, సమాజసేవ చేస్తున్నందుకుగాను తనను ఈ అవార్డుతో సత్కరించినట్లు చెప్పారు. నాలెడ్జి సెంటర్ నిర్వాహకులు స్థపతి పద్మశ్రీ ఆనందాచారి చేతుల మీదుగా సత్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. విశ్వకర్మ లెజెండరీ జాతీయ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను కొయ్యలగూడెం శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం సభ్యులు దార్ల రాంబాబు, జవ్వాది శ్రీను, పెద్దోజు శ్రీనివాసాచార్యులు అభినందించారు.

మెనూ అమలులో నిబంధనలు పాటించాలి


మధ్యాహ్న భోజన కార్మికుల శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ కిరణ్‌బాబు

చింతలపూడి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన మెనూ విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని మడల విద్యాశాఖాధికారి -2 ఎస్ కిరణ్‌బాబు ఆదేశించారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంగా తయారు చేయడం గురించి ఐఎఫ్‌పీ ద్వారా కార్మికులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణకు 130 మంది మధ్యాహ్న భోజన కార్మికులు హాజరైనట్లు ఎంఈఓ జి రామారావు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఆర్‌ఎంటీలు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే పాలన

- సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అందుబాటులోకి ప్రభుత్వ సేవలు
- మండల కేంద్రాలకు పరుగులు పెట్టే అవస్థలు తప్పాయంటున్న ప్రజలు



జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం


చింతలపూడి మండలం రాఘవాపురంలో నిర్మించిన సచివాలయ భవనం

జంగారెడ్డిగూడెం: గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందనేది నానుడి. ఆ నానుడిని నిజం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం దిశగా అనేక చర్యలు చేపట్టారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పాలనను ప్రజల చెంతకు చేరవేశారు. సచివాలయం అనే వరాన్ని గ్రామ ప్రజలకు అందించి, వారి అభివృద్ధికి బాటలు వేశారు. నేడు రాష్ట్రంలో పాలన సక్రమంగా జరుగుతుందంటే సచివాలయ వ్యవస్థ భాగస్వామ్యాన్ని కాదనలేం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సచివాలయం ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందించడం మొదలు పెట్టారు. గతంలో ఏ చిన్న పని జరగాలన్నా మండల కేంద్రాలకు పరుగులు పెట్టే ప్రజలు నేడు సచివాలయం వద్దకు వెళుతున్నారు. కేవలం నాలుగు అడుగుల దూరంలోనే తమ అవసరాలు తీర్చగలిగే సచివాలయాలు ఉండటంతో వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కీలకంగా మారిన సచివాలయ వ్యవస్థ

నేడు రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ కీలకంగా మారింది. అటువంటి వ్యవస్థకు అన్ని రకాల వసతులతో కూడిన పక్కా భవనాలను కల్పించడం కీలకం. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని భవన నిర్మాణాలు చేసింది. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. కొత్తగా వ్యవస్థలు ఏర్పడినప్పుడు వాటిని నడిపించేందుకు సొంత భవనాలు లేకపోవడం, అద్దె భవనాలలో నిర్వహించడంతో గతంలో ఇబ్బందులు తలెత్తేవి. ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం సచివాలయాలకు సొంత భవనాలకు సమకూర్చుతోంది. ప్రతి సచివాలయ భవనానికి రూ.40 లక్షలు కేటాయించడంతో పాటు గ్రామ పరిధిలోనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంది. చింతలపూడి నియోజకవర్గంలో రూ.29.60 కోట్లు సచివాలయాల నిర్మాణానికి వెచ్చిస్తున్నారు. వీటిలో 24 సచివాలయాలు నిర్మాణం పూర్తయితే సంబంధిత శాఖకు అప్పగించారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

ఆధునిక దేవాలయాలు

అభివృద్ధి అంటే మాటల్లో కాదు చేతల్లో ఉండాలి అని సీఎం జగన్ నిరూపించారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను అందించారు. సక్రమంగా ప్రజలకు సేవలు అందించేలా వాటికి భవన నిర్మాణాలు చేశారు. ఒక్కొక్క భవనానికి రూ.40 లక్షలు కేటాయించి జీ ప్లస్ వన్‌గా వాటిని నిర్మించారు. ప్రజలకు సర్టిఫికెట్‌ల నుంచి రెవెన్యూ, రిజిస్ట్రేషన్, శానిటేషన్, విద్య, వైద్యం ఇలా ప్రతి సేవను సచివాలయ వ్యవస్థ ద్వారా అందించేందుకు అనువుగా తీర్చిదిద్దారు. అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ సచివాలయాల్లో సీఎం జగన్ ఏర్పాటు చేశారు. నేడు సచివాలయాలు ఆధునిక దేవాలయాలుగా మారాయంటే సీఎం జగన్ కృషే కారణం.

చింతలపూడి నియోజకవర్గంలోని సచివాలయాల వివరాలు

మొత్తం సచివాలయాలు	74
నిర్మాణం పూర్తయి అప్పగించినవి	24
నిర్మాణం పూర్తయినవి	26
చివరి దశలో ఉన్నవి	08
రెండో శ్లాబ్ పూర్తయినవి	04
మొదటి శ్లాబ్ పూర్తయినవి	04
రూఫ్ స్థాయి పూర్తయినవి	07
పునాది కంటే కింది స్థాయిలో	01

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలం కొత్తపట్టిసీమ పంచాయతీ పరిధిలోని పాపాయమ్మ చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు ఇరిగేషన్ ఏఈ పి.సురేష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి చెరువులోని మట్టి అక్రమంగా తవ్వుతున్నారని, నాలుగు లారీలు, ప్రొక్లెయిన్ తరలించినట్లు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం శ్రీవల్లీదేవసేన సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 1800 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు మాట్లాడుతూ పట్టణంలోని రామచంద్రాపురానికి చెందిన తుమ్మ రామ్మోహనరావు కుటుంబ సభ్యులు, దాతలు అందించిన సహకారంతో అన్నప్రసాద వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో దాతలను మొమెంటో, శాలువాతో సత్కరించారు. అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


ఈవో కొండలరావుకి విరాళం అందజేస్తున్న బీవీఎస్ లక్ష్మి కుటుంబ సభ్యులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన బీవీఎస్ లక్ష్మి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళాన్ని ఈవో ఆకుల కొండలరావుకి అందజేశారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురానికి చెందిన ఆనంద్ భగవత్ పాదుల భజన మండలి వారిచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. వివిధ విరాళాల రూపంలో స్వామివారికి ఆదాయం రూ: 2,02,101 వచ్చిందని, 1600 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈవో కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'మాబ్ ఆపరేషన్'


మాబ్ ఆపరేషన్‌లో భాగంగా అల్లరిమూకల నియంత్రణలో ఏఆర్, పోలీస్ బలగాలు

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున శాంతిభద్రతల పరిరక్షణకు ఏలూరు నగరంలోని పోలీస్ అధికారులు, ఆర్మ్డు రిజర్వ్ బలగాలు, పోలీస్ సిబ్బంది నిర్వహించిన మాబ్ ఆపరేషన్ ఆకట్టుకుంది. ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాలతో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు తంగెళ్లమూడి సెంటరులో మాక్ డ్రిల్ నిర్వహించారు. రాళ్లు, సీసాలు విసురుతూ.. టైర్లు తగలబెడుతూ రోడ్లపై విధ్వంసం సృష్టించే అల్లరిమూకలను అరికట్టే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. వారిపై పోలీస్, ఆర్మ్డ్ రిజర్వ్ బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించటం, లాఠీఛార్జ్ చేయటం, ఆందోళన కారులను చెదరగొట్టడం, వాటర్ కెనాన్, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ వంటివాటిని చేసి చూపించారు. ఈ సందర్భంగా టూటౌన్, వన్‌టౌన్ సీఐలు ప్రభాకర్, రాజశేఖర్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసాలకు పాల్పడితే అణిచివేసేందుకు తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. వన్‌టౌన్, టూటౌన్ ఎస్సైలు లక్ష్మణ్‌బాబు, సాధిక్, మదీనా బాషా, రవితేజ, నవీన్‌కుమార్, ఆర్ఎస్సై నరేంద్ర తదితరులున్నారు.